సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



హుండీ ఆదాయం లెక్కింపు

సీతమ్మధార: విశాఖలోని శ్రీ సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీలు లెక్కించగా 30 రోజులకు గానూ రూ.19.08 లక్షల నగదు వచ్చింది.



వెయిటింగ్ హాల్ ప్రారంభం

విశాఖ సిటీ: నగర ఆర్మ్డ్ రిజర్వ్ ఆవరణలో పోలీస్ మెన్ వెయిటింగ్ హాల్‌ను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం ప్రారంభించారు.



షార్ట్‌ఫిల్మ్‌కు అవార్డు

కంచరపాలెం: విశాఖకు చెందిన జితేంద్రకుమార్ యాదవ్ తీసిన 'డైరీ' షార్ట్‌ఫిల్మ్‌కు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు లభించింది.

న్యూస్‌రీల్

శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు



రోలుగుంట: స్థానిక కోనేరు చెంతనున్న కాశీ విశ్వేశ్వర మృత్యుంజయ శివాలయంలో శనివారం ఉదయం సుమారు ఏడు గంటల సమయంలో శివలింగంపై సూర్యకిరణాలు పడడంతో భక్తులు ఆనంద పరవశులయ్యారు. ఎంతో ప్రాచుర్యం ఉన్న ఈ ఆలయానికి మండలవాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఈశ్వరుడిని దర్శించుకుంటారు. కార్తీక మాసం ప్రారంభానికి ముందు శివలింగాన్ని సూర్యకిరణాలు తాకడం ఎంతో శుభపరిణామమని ఆలయ అర్చకుడు పోలాప్రగడ శ్రీనివాసశర్మ తెలిపారు.

23న రవాణా శాఖ సీజ్ చేసిన వాహనాల వేలం

డాబాగార్డెన్స్ (విశాఖ): అనకాపల్లి ఆర్టీవో కార్యాలయ పరిధిలో రవాణా శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో సీజ్ చేసిన వాహనాలను వేలం వేస్తున్నట్లు అనకాపల్లి ప్రాంతీయ రవాణా శాఖా అధికారి జి.మనోహర్ ఓ ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం, పన్ను బకాయిలు చెల్లించాలని వాహనాల యజమానులకు నోటీసులు జారీ చేసినా.. వారితో పాటు ఫైనాన్షియర్లు కూడా స్పందించలేదన్నారు. ఈ మేరకు ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు అనకాపల్లి ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం వద్ద ఐదు గూడ్స్ వాహనాలు, ఒక మ్యాక్సీ క్యాబ్ వాహనాన్ని బహిరంగ వేలం వేస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు నేరుగా కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

కోడూరులో సర్వే ప్రారంభం

- రైతులు అభ్యంతరం చెప్పినా ఆగని సిబ్బంది

తుమ్మపాల: కోడూరు గ్రామంలో సర్వే నెం.20లో 39.38 ఎకరాల్లో రైతుల సాగులో ఉన్న భూముల్లో శనివారం రెవెన్యూ బృందాలు సర్వే చేపట్టాయి. ప్రభుత్వం సేకరించిన ఈ భూమికి సంబంధించి రైతుల జాబితాలో అవకతవకలు ఉన్నాయంటూ.. గతంలో అధికారులు నిర్ధారించిన జాబితాను రద్దు చేసి టీడీపీ నేత పీలా గోవింద సత్యనారాయణ ప్రోద్బలంతో రెవెన్యూ అధికారులు నూతన జాబితా తయారుచేసేందుకు కుయుక్తులు పన్నుతున్నట్టు రైతులు భయపడుతున్నారు. శుక్రవారం సర్వే బృందాలను రైతులు అడ్డుకోవడంతో.. రెండో రోజు శనివారం సర్వే బృందాలు సర్వే చేసేందుకు సిద్ధమయ్యాయి. ఉదయం వచ్చిన సర్వేయర్లకు రైతులు సహకరించకపోవడంతో గ్రామ తలయారీ సహాయంతో సర్వే చేపట్టాలని తహసీల్దార్ విజయకుమార్ ఆదేశించారు. దీంతో మధ్యాహ్నం నుంచి సర్వే ప్రారంభించారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన ఈవీఎం నోడల్ అధికారి విశ్వేశ్వరరావు

తుమ్మపాల: ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో గల ఈవీఎం గోడౌన్‌ను డిప్యూటీ చీఫ్ ఎన్నికల అధికారి, రాష్ట్ర ఈవీఎం నోడల్ అధికారి కె.విశ్వేశ్వరరావు శనివారం పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి గోడౌన్‌ను తనిఖీ చేశారు. సీళ్లు, సీసీ కెమెరాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి నిర్వహణపై కె.విశ్వేశ్వరరావు సంతృప్తి వ్యక్తం చేశారు. అగ్నిమాపక పరికరాలను ఈవీఎం గోదాం బయట కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. డీఆర్వో బి.దయానిధి, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.వెంకటరమణ, తహసీల్దార్ విజయకుమార్, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి.నాయుడు, రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, కె.హరినాధబాబు, అల్లు రాజు, టి.నాగేశ్వరరావు, షణ్ముఖ్, రమణ పాల్గొన్నారు.

లడ్డూ విక్రయాలు పునఃప్రారంభం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం(టీటీడీ)లో శనివారం శ్రీవారి లడ్డూ విక్రయాలు పునఃప్రారంభమయ్యాయి. తిరుమలలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఇక్కడ లడ్డూ విక్రయాలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఇక నుంచి ప్రతి రోజూ లడ్డూ విక్రయాలు ఉంటాయని ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. కాగా.. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

- వైఎస్సార్‌సీపీ అల్టిమేటం ఫలితం..

గబ్బాడలో కదిలిన ఇసుక

- రాత్రికి రాత్రే సరఫరా ప్రారంభించిన అధికారులు
- ఉచితం పేరుతో లబ్ధిదారులపై భారం
- ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు సిద్ధమవుతున్న వైఎస్సార్‌సీపీ





కొబ్బరి కాయకొట్టి గబ్బాడ డిపోలో ఇసుక సరఫరాను ప్రారంభించిన మైనింగ్ ఏడీ శివాజీ, (ఇన్‌సెట్) ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేస్తున్న యంత్రాలు

నర్సీపట్నం: గబ్బాడ డిపోలోని ఇసుకను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ర్యాలీకి పిలుపునివ్వడంతో ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది. అధికారులు ఆగమేఘాల మీద డిపోలోని ఇసుక సరఫరాను శనివారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు డిపోను సందర్శించి.. డిపోలోకి ఇంత ఇసుక ఎవరు డంప్ చేశారో నిగ్గు తేల్చిన తరువాతే సరఫరా చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వాల్టా చట్టాన్ని అతిక్రమించి ఇసుక డంప్ చేశారని మైనింగ్ అధికారులు ప్రతిమ ఇన్‌ఫ్రా కంపెనీకి రూ.18 కోట్లు జరిమానా విధిస్తూ నోటీసు జారీ చేశారు. కంపెనీ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించగా స్టే విధించారు. దీంతో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించిన విచారణ అటుకెక్కింది. విచారణ పూర్తయి పక్షం రోజులు కావస్తున్నా డిపోలో ఇసుక సరఫరాకు అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణదారులు, కార్మికులు నాలుగు నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు.

గణేష్ ఫిర్యాదుతో కదలిక

ఇసుక కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా డిపోలో ఇసుకను ఉచితంగా పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డిపోలో ఇసుకను ఉచితంగా పంపిణీ చేయకపోతే ప్రజల పక్షాన ఈ నెల 21న ర్యాలీ చేపడతామని మాజీ ఎమ్మెల్యే ప్రకటించారు. నాలుగు నెలలుగా ఇసుక సరఫరాపై దృష్టి సారించని మైనింగ్ అధికారులు టీడీపీ నాయకులను వెంట పెట్టుకుని శనివారం రాత్రి గబ్బాడ ఇసుక డిపోకు చేరుకున్నారు. హడావుడిగా మైనింగ్ ఏడీ శివాజీ కొబ్బరి కాయకొట్టి ఇసుక సరఫరాను ప్రారంభించారు. రవాణా ఖర్చు నిమిత్తం టన్నుకు రూ.1,165లు ప్రభుత్వం ధర నిర్ణయించిందని ఏడీ పేర్కొన్నారు. డిపో నుంచి సొంత ఖర్చులతోనే అవసరమైన వారు ఇసుక తీసుకువెళ్లవచ్చునని, లేని పక్షంలో డిపో నుంచి కిలోమీటరుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు లబ్ధిదారుడి ఇంటికి ఇసుక సరఫరా చేస్తామని ఏడీ ప్రకటించారు. ట్రాక్టర్ ఇసుక రాజమహేంద్రవరం నుంచి ఇక్కడకు తీసుకురావడానికి రూ.4,660 వసూలు చేస్తున్నారు. డిపో నుంచి తీసుకువెళ్లడానికి రవాణా ఖర్చులతో కలిసి రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు లబ్ధిదారులపై భారం పడనుంది. ఉచిత ఇసుక విధానం అంటే ఇదేనా అని లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. డిపో నుంచి ఇసుక తీసుకువెళ్లాలంటే తప్పనిసరిగా నగదు చెల్లించాల్సిందే. ఉచిత ఇసుక విధానంపై ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు

తుమ్మపాల: గబ్బాడ డిపో నుంచి ఇసుక కోసం ఆన్‌లైన్‌లో (rand.ap.gov.in) బుక్ చేసుకోవచ్చునని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలియజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గబ్బాడ ఇసుక డిపో ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇసుక ధరను టన్నుకు రూ.1,165గా జిల్లా ఇసుక స్థాయి కమిటీ నిర్ణయించిందన్నారు. జిల్లాలో ఏవిధమైన 4వ స్థాయి, 5వ స్థాయి నదులు ప్రవహించటం లేదని, వాగులు, వంకలు, చిన్న నదులు 2, 3వ స్థాయిలో గల సర్పానది, శారద, తాండవ, వరాహ నదులు మాత్రమే ఉండటం వలన ఇసుక లభ్యత కోసం దూరప్రాంతాలైన శ్రీకాకుళం, తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గల నదీ ప్రాంతంలో ఉన్న ఇసుక రీచ్‌లపై ఆధారపడవలసి ఉంటుందన్నారు. ప్రస్తుతం నర్సీపట్నం వద్ద గబ్బాడ ఇసుక డిపోలో 48,204 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు.

బెడిసికొడుతున్న

'రీసర్వే' వ్యూహం

దేవరాపల్లి మండలంలోని తామరబ్బ పంచాయతీలో 5 రెవెన్యూ గ్రామాలున్నాయి. మూడు రోజులుగా ఈ పంచాయతీ పరిధిలో రెవెన్యూ గ్రామ సభలు జరిగాయి. రీసర్వే భూ సమస్యలతోపాటు ఇతర భూ సమస్యలను కూడా స్వీకరించారు. సర్వే నంబర్లు తేడా, విస్తీర్ణం తేడా, రైతు పేరు మార్పులు, పాస్‌బుక్‌లో మార్పులు వంటి సమస్యలపై కూడా దరఖాస్తులు వచ్చాయి. 3 రోజుల్లో 32 దరఖాస్తులు రాగా వీటిలో 10 రీసర్వేలో ఉన్న చిన్నపాటి భూ సమస్యలున్నాయి. మిగతా 22 దరఖాస్తులు ఇతర భూ సమస్యల పైనే. చిక్కులున్న భూ సమస్యలు, దీర్ఘకాలికంగా పరిష్కారం కాని భూ సమస్యలను తీసుకోవడం లేదు. ఇలాంటి పరిస్థితి జిల్లా అంతటా ఉంది.

- గ్రామ సభల్లో ఇతర రెవెన్యూ సమస్యల పైనే ఎక్కువ దరఖాస్తులు
- చిక్కులున్న భూసమస్యలను పట్టించుకోని అధికారులు
- రీసర్వే విధానాన్ని తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం
- దరఖాస్తులు ఎక్కువగా చూపించేందుకు యత్నాలు
- మూడు రోజుల్లో 2,904 దరఖాస్తుల స్వీకరణ



తామరబ్బ పంచాయతీ పరిధిలోని పెద సోంపురం రెవెన్యూ గ్రామ సభలో అర్జీలు స్వీకరిస్తున్న దేవరాపల్లి తహసీల్దార్ లక్ష్మీదేవి

సాక్షి, అనకాపల్లి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన రీసర్వే విధానాన్ని తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం బెడిసికొడుతోంది. రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించి సమస్యలు ఉన్నట్టు చూపించే యత్నం అనుకున్నంతగా సఫలం కాకపోవడంతో కూటమి నాయకులు ఆలోచనలో పడ్డారు. వారి రాజకీయాలతో ప్రభుత్వ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. వందేళ్ల తర్వాత దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ముందు చూపుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమగ్ర భూసర్వే విధానాన్ని తీసుకొచ్చింది. జిల్లాలో మూడు విడతల్లో దాదాపుగా 90 శాతం వరకు 455 గ్రామాల్లో ఈ రీసర్వే ప్రక్రియ పూర్తయింది. అత్యంత పారదర్శకంగా జరిగిన ఈ రీసర్వే ప్రక్రియను తప్పు పట్టే విధంగా.. రీసర్వే ద్వారా పొరపాట్లు, తప్పులు జరిగినట్లుగా ప్రజలకు చూపించేందుకే కూటమి ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తోంది. జగనన్న సమగ్ర భూ రీసర్వే ద్వారా రైతులకు న్యాయం జరిగిందే తప్ప అన్యాయం జరగలేదని రైతులు బలంగా నమ్ముతున్నారు. అందుకే గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ గ్రామ సభల్లో రీసర్వే ద్వారా తలెత్తిన భూ సమస్యల కన్నా.. ఇతర భూ సమస్యలే ఎక్కువగా వస్తున్నాయి. గ్రామ రెవెన్యూ సభల్లో చిన్నపాటి భూ సమస్య ఉన్నా.. దాన్ని రీసర్వే జాబితాలో చేర్చే ప్రయత్నం అధికారులు చేస్తున్నారు.

మొక్కుబడిగా..

ఈనెల 16 నుంచి నెల రోజులపాటు 455 గ్రామాల్లో సభలను నిర్వహిస్తున్నారు. మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 2,904 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సభల్లో చిక్కులున్న భూసమస్యలు, దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యలు, ఇతర భూవివాదాలు, భూసరిహద్దు సమస్యలపై దరఖాస్తులు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పారదర్శకంగా జరిగిన రీసర్వేలో సమస్యలు లేవు గానీ.. ఎప్పటి నుంచో లిటిగేషన్‌లో, చిక్కుల్లో ఉన్న భూసమస్యలను పరిష్కరించమని వారు కోరుతున్నారు. తక్కువ వ్యవధిలో పరిష్కారమయ్యే చిన్నపాటి రెవెన్యూ సమస్యలపైనే రెవెన్యూ అధికారులు దరఖాస్తులు తీసుకుంటున్నారు. దీర్ఘకాలిక, చిక్కులున్న భూసమస్యలపై దరఖాస్తులు తీసుకుంటే వాటిని నెల రోజుల్లో పరిష్కరించలేమని అధికారులు ముందు జాగ్రత్త పడుతున్నారు.

ఆధునిక వ్యవసాయంతో అధిక లాభాలు



డ్రోన్ సాయంతో పురుగుమందు పిచికారి విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి అనిత, కలెక్టర్ విజయ కృష్ణన్

నక్కపల్లి: వ్యవసాయానికి ఆధునికత జోడించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చని కలెక్టర్ విజయ్ కృష్ణన్ అన్నారు. శనివారం ఆమె హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రోన్ ద్వారా తెగుళ్ల నివారణ కోసం పురుగుల మందు పిచికారీ చేసే విధానాన్ని మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ కలెక్టర్, మంత్రులకు వివరించారు. ఒక ఎకరానికి 7 నిమిషాల్లో పురుగు మందులు పిచికారీ చేయవచ్చని తెలియజేశారు. ఎకరానికి రూ.400 ఖర్చవుతుందన్నారు. వేగవంతం, సులభతరం, మెరుగైన ఉత్పాదకత, అధిక రాబడితోపాటు సరైన మోతాదుల వలన మందు ద్రావణం వృథా కాదన్నారు. మంత్రి, కలెక్టర్‌లు మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. కోరమండల్ ఫెర్టిలైజర్స్ సీనియర్ మేనేజర్ పృథ్వి, ఆర్డీవో రమణ, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, సర్పంచ్ చంద్రరావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతిలోగా పల్లె పండగ పనులు పూర్తిచేయాలి

నక్కపల్లి: పల్లె పండగ ద్వారా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను సంక్రాంతిలోగా పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేసుకోవాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. శనివారం చినదొడ్డిగల్లులో జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో కలెక్టర్ విజయ్ కృష్ణన్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. మంత్రి అనిత మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం జరుగుతోందన్నారు. ఉద్దండపురం వద్ద అసంపూర్తిగా ఉండిపోయిన వాటర్‌గ్రిడ్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయన్నారు. ఆర్డీవో వి.వి.రమణ, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో న్యాయమూర్తులు



చోడవరం రూరల్: పారిశుధ్య పనిలో భాగంగా చీపురు పట్టిన న్యాయమూర్తులు



అనకాపల్లి: స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న న్యాయమూర్తులు, సిబ్బంది

చోడవరం రూరల్/తుమ్మపాల: అన్యాయాన్ని తుడిచేసి న్యాయానికి పెద్ద పీట వేసే న్యాయమూర్తులు శనివారం చీపురు పట్టారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. చోడవరంలో 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రత్నకుమార్, అనకాపల్లిలో పదో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. న్యాయమూర్తులు మాట్లాడుతూ.. మన ఇంటిని ఏ రీతిలో శుభ్రంగా ఉంచుకుంటామో అదే రీతిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పనిచేసే కార్యాలయాల్లో చెత్తా చెదారం పేరుకుపోకుండా చూడాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు బి.సూర్యకళ, ధర్మారావు, రమేష్, విజయలక్ష్మి, చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంద్రేగుల డేవిడ్ పాల్గొన్నారు.

అశ్రునయనాలతో అంతిమయాత్ర

- ఆర్మీ జవానుకు సైనిక లాంఛనాలతో తుది వీడ్కోలు



ఆర్మీ జవాన్ పరవాడ నాయుడుబాబు అంతిమయాత్ర (ఇన్‌సెట్) నాయుడుబాబుకు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

కశింకోట: ఆర్మీ జవాన్ పరవాడ నాయుడుబాబు అంత్యక్రియలు శనివారం సైనిక లాంఛనాలతో జరిగాయి. జమ్మూ కాశ్మీర్‌లోని లేహ్(లడక్)లో ఆర్మీలో క్లరికల్ జవాన్‌గా పనిచేస్తున్న నాయుడుబాబు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. అతని సొంత గ్రామం పరవాడపాలెంలో శనివారం ఆర్మీ అధికారులు, స్థానిక పోలీసు అధికారులు, బంధుమిత్రులు ఘనంగా నివాళులర్పించారు. శ్మశానానికి తీన్‌మార్, బ్యాండు మేళంతో పెద్ద ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ఆర్మీ అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది పరేడ్ చేశారు. మౌనం పాటించారు. గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్మీ సుబేదార్ మేజర్ అర్జునరావు, ఆర్మీ అధికారులు, సిబ్బంది విజయ్, ప్రసాద్, ప్రమోద్ తివారి, రంగన్‌కుమార్ స్వేన్, స్థానిక సీఐ అల్లు స్వామినాయుడు, ఆర్మ్ డ్ పోలీసు ఎస్ఐ కేశవరావు, సిబ్బంది , స్థానిక నాయకులు ఉగ్గిన రమణమూర్తి, ఒమ్మి కోటేశ్వరరావు, కలగా సోమేశ్వరరావు, గొంతిన గంగాధరరావు, ముసిలినాయుడు,గొంతిన శివ, గొంతిన లోవఅప్పారావు తదితరులు పాల్గొన్నారు. నాయుడుబాబు భౌతిక కాయానికి అన్న భవాని యోగేశ్వరరావు తలకొరివి పెట్టాడు.

పదోన్నతి రాకుండానే...

జవాన్‌గా ఉన్న నాయుడుబాబు నాయక్‌గా పదోన్నతి కోసం పంజాబ్‌లోని ఆర్మీ ఇంజనీరింగ్ డివిజన్‌కు విమానంలో వెళ్లడానికి బయలుదేరాడు. ఈనేపథ్యంలో ఇంకా వెళ్లకుండానే గుండెపోటుకు గురై మృతి చెందాడు. దీంతో ఈ సంఘటన కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేసింది. ఇక తనకు దిక్కెవరంటూ నాయుడుబాబు భౌతిక కాయం వద్ద భార్య శాంతి రోదించడం చూపరులను కలచివేసింది.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణకు

60 మంది టీచర్లు

యలమంచిలి రూరల్: ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) శిక్షణకు జిల్లా నుంచి 60 మంది ఉపాధ్యాయులు హాజరు కానున్నట్టు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.ఎం.పట్నాయక్ చెప్పారు. ఈ నెల 21న ప్రారంభమయ్యే ఈ శిక్షణ విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస గ్రామానికి సమీపంలో ఉన్న ఓస్టర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పూర్తిగా గురుకుల పద్ధతిలో జరగనుంది. ఆరు రోజులపాటు కొనసాగనున్న ఈ శిక్షణకు జిల్లాలో వివిధ ప్రభుత్వ స్కూళ్లలో 1, 2 తరగతులు బోధిస్తున్న 60 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. 2026 నాటికి 1, 2 తరగతుల పిల్లలందరికీ కనీసం చదవడం, రాయడం సంపూర్ణంగా రావాలనే ఉద్దేశంతో ఈ శిక్షణకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. తెలుగు, ఇంగ్లీషు, గణితం సబ్జెక్టులపై బోధనా మెలకువలపై జిల్లా స్థాయి రిసోర్సు పర్సన్లు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నారు. ఆటపాటలు, కళాకృతులు, నృత్యాలు, బొమ్మల ఆధారంగా విద్యార్థులకు మానసికంగా ఉత్సాహంగా ఉండే విధంగా బోధన చేపట్టేలా టీచర్లకు తర్ఫీదునిస్తారు. శిక్షణకు హాజరయ్యే టీచర్లకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనంతోపాటు వసతి సదుపాయం కూడా అక్కడే కల్పించినట్టు ఏఎంవో పట్నాయక్ తెలిపారు.

ఎస్పీ దీపికకు వీడ్కోలు సత్కారం



ఎస్పీ దీపిక దంపతులను శాలువాతో సత్కరిస్తున్న అదనపు ఎస్పీలు, పోలీస్ సిబ్బంది

అనకాపల్లి: పోలీస్ శాఖలో అంకిత భావంతో పనిచేసే సిబ్బందికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పెంటకోట కన్వెన్షన్ హాల్లో శనివారం రాత్రి ఎస్పీ వీడ్కోలు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 17వ తేదీన విజయనగరం జిల్లా నుంచి అనకాపల్లికి సాధారణ బదిలీల్లో భాగంగా వచ్చానన్నారు. జిల్లాలో తమ సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించడం వలన వివిధ కేసుల్లో ముద్దాయిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చడం జరిగిందన్నారు. అనకాపల్లి జిల్లా నుంచి కాకినాడ జిల్లా 5వ బెటాలియన్‌కు కమాండెంట్‌గా వెళుతున్నట్టు ఆమె చెప్పారు. అనంతరం జిల్లా పోలీసులు ఎస్పీ ఎం.దీపిక దంపతులను శాలువాతో సత్కరించారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూడోలో వరహాపురం విద్యార్థి సత్తా


ఎంపికైన విద్యార్థితో హెచ్ఎం వరహామూర్తి, పీడీ సింహాచలం

చీడికాడ : మండలంలోని వరహాపురం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అండర్ -17 విభాగంలో జూడోలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం వరహామూర్తి తెలిపారు. స్కూల్ గేమ్స్‌లో భాగంగా జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎస్.గుణప్రసాద్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో శ్రీకాళహస్తిలో జరిగే పోటీల్లో పాల్గొంటున్నాడన్నారు. ఈ మేరకు గుణప్రసాద్‌ను పాఠశాల సిబ్బందితో పాటు పీడీ సింహాచలం అభినందించారు.

వాలీబాల్ పోటీలకు హరిపాలెం విద్యార్థిని


బాలాశ్రీ

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం హరిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని జి.బాలాశ్రీ అండర్-17 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరు హైస్కూల్లో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి టోర్నమెంట్ కప్ పోటీల్లో బాలాశ్రీని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా హిందూపురంలో ఈ నెల 21నుంచి 23 వరకు జరుగు రాష్ట్రస్థాయి పోటీల్లో బాలాశ్రీ పాల్గొంటారని హెచ్ఎం శ్రీ పాద రవి తెలిపారు.

ఉత్సాహంగా కరాటే పోటీలు

విశాఖ విద్య: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఇండోర్ స్టేడియంలో శనివారం కరాటే పోటీలు జరిగాయి. అండర్-14, అండర్-17 బాల బాలికల పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని స్కూళ్ల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. 400 మంది వరకు పోటీల్లో పాల్గొనడటంతో ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో పండగ వాతావరణం కనిపించింది. క్రీడాకారులు, వారితో వచ్చిన సహాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఆ ప్రాంగణం సందడిగా మారింది. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ గోపాలపట్నం హైస్కూల్‌లో భోజనం అందించారు. బాల, బాలికలు కరాటేలో తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించగా.. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. తమ పిల్లల కరాటే విన్యాసాలను తల్లిదండ్రులు సెల్‌ఫోన్లలో బంధించారు. వివిధ కరాటే అసోసియేషన్‌లకు చెందిన కోచ్‌లు రిఫరీలుగా వ్యవహరించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఎస్జీఎఫ్ కార్యదర్శి దేముడుబాబు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

దేవరాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల జెడ్పీ హైస్కూలు ఆవరణలో శనివారం ఉమ్మడి విశాఖ జిల్లా ఖోఖో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని వేర్వేరు పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో తెనుగుపూడి డా.బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యార్థులు జి.అజయ్, పి.సాయి కుమార్ సత్తా చాటి, రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారు. దీంతో ఆయా విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు జి.తరుణేశ్వరరావు, పీడీ నాగేశ్వరరావులను ప్రిన్సిపాల్ పి.రఘు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నర్సింహమూర్తి అభినందించారు. అలాగే అండర్-17 కబడ్డీలో రాష్ట్ర స్థాయికి అర్హత సాధించిన ఎ.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కంచిపాటి భానుమతిని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, మండల విద్యాశాఖ అధికారి వి.ఉషారాణి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత అభినందించారు. దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కక్కల దుర్గా ప్రసాద్ అండర్-17 కబడ్డీ పోటీలకు అర్హత సాధించాడు. ఆ విద్యార్థితో పాటు శిక్షణ ఇచ్చిన పీడీ బాబురావును స్థానిక కాలేజీ ప్రిన్సిపాల్ బి.రాధ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.


కొత్తపల్లిలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని భానుమతితో ఎంఈవో ఉషారాణి, హెచ్ఎం స్వర్ణలత


తెనుగుపూడి గురుకులంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ తరుణేశ్వరరావు


దేవరాపల్లి ప్రభుత్వ కాలేజీలో విద్యార్థి దుర్గా ప్రసాద్‌తో ప్రిన్సిపాల్ రాధ, పీడీ బాబూరావు

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక

అనకాపల్లి : స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్దహైస్కూల్ ఆవరణలో విశాఖ ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14, 17 సంవత్సరాల బాలబాలికల చెస్ పోటీలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ జిల్లా సమైక్య కార్యదర్శి మోటూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు చెప్పారు. 14 సంవత్సరాల విభాగంలో 16 మంది, 17 సంవత్సరాల విభాగంలో 16 మంది క్రీడాకారులు పోటీల్లో గెలుపొందారని, ఆయా క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన అండర్ -14 విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అండర్-17 విద్యార్థులు

పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యునిపై విచారణ

ఎస్.రాయవరం : పెనుగొల్లు పీహెచ్‌సీలో మొదటి వైద్యుని ఫిర్యాదు మేరకు రెండో వైద్యునిపై జిల్లా వైద్యాధికారి బృందం శనివారం విచారణ నిర్వహించారు. పీహెచ్‌సీలో డ్రాయింగ్ పవర్ ఉన్న వైద్యాధికారి రాజేశ్వరి, పీహెచ్‌సీ సిబ్బందికి రెండో వైద్యాధికారి రామ్‌నాయక్ మధ్య వివాదాలు ఉన్నాయి. పీహెచ్‌సీ సిబ్బంది నుంచి, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా వైద్యాధికారి బృందం ప్రాథమిక విచారణ చేసి ఈనెల 14న రామ్‌నాయక్‌ను సస్పెండ్ చేసినట్టు విచారణకు విచ్చేసిన అడిషినల్ డీఎంహెచ్‌వో జ్యోతి తెలిపారు. పూర్తి విచారణ జరిపి నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామన్నారు. కాగా పీహెచ్‌సీలో విచారణ సందర్భంగా స్థానికులు పీహెచ్‌సీ వద్ద పెద్ద ఎత్తున గుమిగూడారు. పీహెచ్‌సీలో సక్రమంగా వైద్య సేవలు అందిస్తున్న అధికారిని సస్పెండ్ చేయడం ఏమిటని పలువురు విచారణ బృందాన్ని నిలదీశారు. అయితే రామ్‌నాయక్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా వైద్యాధికారులు విచారణకు ఆదేశించారని, ఎవరికైనా సమస్య ఉంటే రాత పూర్వకంగా తెలియజేయాలని ఏడీఎంహెచ్‌వో వారికి సూచించారు. దీంతో పీహెచ్‌సీ పరిధిలో ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రామ్‌నాయక్ సేవలు పీహెచ్‌సీలో అవసరమని, ఆయన రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందిస్తున్నారని రాతపూర్వకంగా విచారణ బృందానికి అందజేశారు.


పెనుగొల్లు పీహెచ్‌సీలో విచారణ బృందంతో మాట్లాడుతున్న స్థానికులు

నాపై పదే పదే తప్పుడు ఫిర్యాదులు : రామ్‌నాయక్

తనపై పదేపదే తప్పుడు ఫిర్యాదులు ఇస్తున్నారని, తనపై గత ఏడాది జనవరి, ఫిబ్రవరిలో తప్పుడు ఫిర్యాదు చేసి రెండు నెలల పాటు సరెండర్ చేశారని రామ్‌నాయక్ అన్నారు. తాను చేసిన తప్పేంటని హైకోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుని ఈ ఏడాది ఏప్రిల్లో విధుల్లో చేరానన్నారు. ఇపుడు మళ్లీ తప్పుడు ఫిర్యాదుతో ప్రాథమిక విచారణ కూడా చేపట్టకుండా తనను సస్పెండ్ చేసినట్టు ఆర్డర్ వాట్సప్‌లో పంపారని తెలిపారు. ఎంక్వయిరీ అని మళ్లీ ఈ బృందం విచారణ చేస్తున్నారన్నారు. తాను తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుని శిక్షించాలని, లేకుంటే నా విధులకు ఆటంకం లేకుండా జిల్లా అధికారులు చూడాలని కోరారు.


విచారణ బృందాన్ని కలిసేందుకు వచ్చిన స్థానిక సర్పంచ్‌లు, నాయకులు

ఆశ్రమ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

నాతవరం : నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి పటాన్ సియాజ్‌ఖాన్ సుడిగాలి పర్యటన చేశారు. మండలంలో తాండవ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, చమ్మచింత బాలుర వసతి గృహం, రామన్నపాలెంలో గిరిజన ఆశ్రమ పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాతవరం ఎస్సీ బాలుర బాలికలు, బీసీ బాలుర వసతి గృహాలను తనిఖీ చేశారు. తాండవ ఆశ్రమ బాలికల హాస్టల్లో విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. కొందరు విద్యార్థులకు ఆయా పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగారు. తాండవ రామన్నపాలెం గిరిజన హాస్టల్ సముదాయాలను స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా లేదా , ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే కాస్మటిక్ సామాగ్రి తదితర వస్తువులు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం జడ్జి పటాన్ సియాజ్‌ఖాన్ మాట్లాడుతూ హైకోర్టు నుంచి వచ్చిన అదేశాల ప్రకారం హాస్టళ్లలో తనిఖీలు జరిపామన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అంశాలతో పాటు విద్యార్థులు చెప్పిన సమస్యలను నివేదిక ద్వారా పంపించడం జరుగుతుందన్నారు.


తాండవ గిరిజన హాస్టల్లో విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి పటాన్ సియాజ్‌ఖాన్

ఇంజినీరింగ్‌లో ప్రతిభే కొలమానం


ఇండక్షన్ మీట్‌లో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ జయసుమ


ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ధ్రువపత్రాలు అందిస్తున్న రిజిస్ట్రార్, శ్రీనివాసరావు

- విజయనగరం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ జయ సుమ
- అవంతి కళాశాలలో ఇండక్షన్ మీట్

మాకవరపాలెం : ఇంజినీరింగ్ విద్యలో ప్రతిభే కొలమానమని విజయనగరం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ జయసుమ అన్నారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నూతన విద్యార్థులతో ఇండక్షన్ మీట్ నిర్వహించారు. ముందుగా అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావుతో కలసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం జయసుమ మాట్లాడుతూ వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఇంజినీరింగ్ డిగ్రీతోపాటు ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకునేందుకు విద్యార్థులు శ్రమించాలన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో పోటీపడుతున్నారన్నారు. మన విజ్ఞానం వ్యక్తిగత అభివృద్ధికి కాకుండా దేశానికి ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిత్వం ముఖ్యమని, అది కోల్పోతే సంపాదించుకోలేమని స్వామి వివేకానంద మాటలను గుర్తు చేశారు. విశాఖ ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గేశ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ అంటే ఒక డిగ్రీ కాదని, ఇంజినీరింగ్ విజ్ఞానం మన దేశ సాంకేతికతలోని అభివృద్ధిని చూపిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. విశాఖ 13వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ నీరజ్ కుమార్ మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం , మనల్ని మనం నియంత్రించు కోవడంపై ఆధార పడి ఉంటుందన్నారు. జిన్షే టెక్నాలజీస్ మానవవనరుల అధికారి సురేష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు ప్రసంగించారు. ర్యాగింగ్‌కు పాల్పడడం వల్ల కలిగే ఇబ్బందులను విద్యార్థులకు వివరించారు. అనంతరం 16 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ధ్రువపత్రాలు అందజేశారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు జ్ఞాపికలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 2 వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరి సాగు విస్తీర్ణం పెరిగింది

అనకాపల్లి: ఈ ఏడాది జిల్లాలో ఖరీఫ్ సాగు సకాలంలో కురిసిన వర్షాలు, వాతావరణం పరిస్థితుల కారణంగా సాగు బాగుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శనివారం టి అండ్ వి సమావేశం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సమావేశం జరిగింది. జిల్లాలోని అనుకూల వాతావరణ పరిస్థితుల వల్ల వరి సాగు 105 శాతం పెరిగిందని, అపరాలు 75 శాతం, చిరుధాన్యాలు 67 శాతం నమోదయ్యాయని తెలిపారు. ఈ ఏడాది జూన్ నుంచి నేటి వరకూ 11శాతం అధిక వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలో అధిక విస్తీర్ణం వరి సాగును రైతులు చేపట్టినట్టు చెప్పారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహనరావు మాట్లాడుతూ సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో జిల్లాలో కురిసిన వర్షాల వల్ల రాబోయే రబీ సీజన్లో అపరాలు, నువ్వులు వంటి పంటల సాగుకు అనుకూలంగా ఉందన్నారు. విశాఖ జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.అప్పలస్వామి మాట్లాడుతూ వరిలో ప్రధానంగా పొడతెగులు, ఆకుముడత పురుగు పై రైతులు దృష్టిపెట్టాలని, వరిలో దోమ కనిపిస్తుందని, పొలం పిలుస్తుంది కార్యక్రమాల ద్వారా ప్రధాన పంటల్లో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, పి.శ్రీదేవి, డి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అధ్యాపకుడు రామారావుకు జమ్మూ వర్సిటీ పురస్కారం

యలమంచిలి రూరల్ : స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి రేఖా రామారావుకు జమ్మూ యూనివర్సిటీ పురస్కారం అందించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్, పలు విభాగాల హెచ్‌వోడీలు శనివారం అభినందించారు. ఇటీవల అధ్యాపకుడు రామారావుకు జమ్మూ యూనివర్సిటీ నుంచి సావిత్రీబాయి పూలే అంతర్ రాష్ట్రీయ శిక్షక్ అచీవర్స్ అవార్డు ప్రదానం చేసింది. 36 సంవత్సరాలుగా బోధనా రంగంలో విద్యార్థులకు, పలు కళాశాలలకు అంకిత భావంతో సేవలందించినందుకు ఈ పురస్కారం లభించిందని పలువురు ఆయన సేవలను కొనియాడారు. గతంలో రామారావు ఏజెన్సీ ప్రాంతంలో 14 సంవత్సరాలు పనిచేశారు. విశాఖపట్నం డాక్టర్ వీఎస్ కృష్ణా కాలేజీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్‌గా, ఆంధ్ర విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్రం బోర్డ్ ఆఫ్ స్టడీస్ డైరెక్టర్‌గా, ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల డీఆర్సీగా ఆయన విలువైన సేవలందించారని వక్తలు ప్రస్తావించారు. ఈ మేరకు శనివారం రామారావును పలువురు విద్యార్థులు, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వై.పోలిరెడ్డి పాల్గొన్నారు.


అధ్యాపకుడు రామారావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, హెచ్‌వోడీలు

రూ.4.40 లక్షల విలువైన
గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కుమార స్వామి

నక్కపల్లి : ఉమ్మడి విశాఖ జిల్లా ఏజెన్సీ(ఏవోబీ) ప్రాంతం నుంచి కారులో తరలిస్తున్న 146 కిలోల గంజాయిని శనివారం నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన రామేశ్వర్ చౌహన్, రాబిన్ అనే వ్యక్తులు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తీసుకు రావాలని మోమిన్ రీస్ జాలా, ప్రకాష్ మంగీలాల్ జయదేవ్‌లకు పురమాయించారు. ఈనెల 11న జాలా, జయదేవ్‌లు కారులో విశాఖ చేరుకున్నారు. 15న రామేశ్వర్ చౌహన్, రాబిన్ కూడా విశాఖ వచ్చారు. శనివారం ఉదయం మోమిన్ రీస్ జాలా, ప్రకాష్ మంగీలాల్ జయదేవ్ కారులో ముంచంగిపుట్టు వద్ద కొనుగోలు చేసిన 146 కిలోల గంజాయిని మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు తరలిస్తుండగా వేంపాడు టోల్‌ప్లాజా వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. రెండేసి కిలోల చొప్పున 73 ప్యాకెట్లలో ఈ గంజాయిని తరలిస్తున్నారని, పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు రూ.4.40 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశామన్నారు. ఇదే కేసులో రామేశ్వర్ చౌహన్, రాబిన్‌ల కోసం గాలిస్తున్నామన్నారు.

సర్పంచ్ సస్పెన్షన్ నిలిపివేత

- డీపీవోకు ఆ అధికారం లేదని హైకోర్టు స్పష్టీకరణ


సర్పంచ్ కోటేశ్వరరావు


పాయకరావుపేట: తనపై జిల్లా పంచాయతీ అధికారి విధించిన సస్పెన్షన్ నిలిపివేస్తూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని పాల్మన్‌పేట సర్పంచ్ కోడ కోటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సాల్వెన్సీ సర్టిఫికెట్ల జారీలో తాను అధికార దుర్వినియోగానికి పాల్పడ్డానంటూ తన ప్రత్యర్థులు చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి తనను సర్పంచ్ పదవి నుంచి మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ తాను హైకోర్టును ఆశ్రయించానన్నారు. అయితే సర్పంచ్‌ను సస్పెండ్ చేసే అధికారం డీపీవోకు లేదని, ఈ వ్యవహారం కలెక్టర్ పరిధిలోనిదని, తక్షణమే సస్పెన్షన్ ఉత్తర్వులు పక్కన పెట్టాలని హైకోర్టు ఈనెల 4వ తేదీన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రెండు వారాలైనా హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో తాను తిరిగి కోర్టు ధిక్కార నేరంపై డీపీవోకు నోటీసులు ఇవ్వడం జరిగిందని కోటేశ్వరరావు తెలిపారు. సర్పంచ్‌పై వచ్చిన అభియోగాలపై చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్‌కు మాత్రమే ఉంటుందని, సమగ్ర విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకునే విషయం కలెక్టర్ పరిధిలో ఉంటుందని కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం.

పోలీసుల అమరవీరుల దినోత్సవానికి ఏర్పాట్లు


రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

ఏయూక్యాంపస్: పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు బీచ్ రోడ్డులోని పోలీస్ మెస్ ఎదురుగా ఉన్న పోలీసు అమరవీరుల స్థూపాన్ని శుభ్రం చేసి.. రంగులు వేశారు. బీచ్‌రోడ్డులో పోలీసులు ముమ్మరంగా రిహార్సల్ చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో పోలీసులు తుపాకులు చేతపట్టుకొని.. అమరవీరులకు గౌరవ వందనం అందించే ఘట్టం అటుగా వెళ్లే సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.

పాము కాటుతో మహిళ మృతి


బొడ్డేడ మాణిక్యం (ఫైల్)

మునగపాక : మండలంలోని టి.సిరసపల్లికి చెందిన బొడ్డేడ మాణిక్యం (51) అనే మహిళ పాముకాటుకు గురై మృతి చెందింది. శుక్రవారం రాత్రి ఇంటిలో వంట చేస్తూ ఆమె కొంత సేపు సేద తీరేందుకు ఆరుబయటకు రాగా అక్కడ పాము కాటు వేసింది. దీంతో గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మాణిక్యం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు భోరున విలపించారు. గ్రామంలో విషాదం నెలకొంది.

క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం రేపు



ఎంపీడీవో నరసింహారావు

తుమ్మపాల: అనకాపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 21వ తేదీ సోమవారం ఉదయం 10.30 నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.వి.నరసింహారావు తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్న 14వ సాధారణ సర్వసభ్య సమావేశానికి మండలంలో అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పరమేశ్వరరావు

కశింకోట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కోరారు. స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూలులో శనివారం గ్రీన్ ట్రీస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.వి.జె.ప్రసాద్, ట్రస్టు చైర్మన్ దొడ్డి సన్నిబాబు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో శివుని విగ్రహం ఆవిష్కరణ



తాళ్లపాలెం శ్మశాన వాటికలో ఆవిష్కరించిన శివుని విగ్రహం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో జాతీయ రహదారి పక్కన ఉన్న శ్మశాన వాటికలో శివుని విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. గుమ్మడి సూర్యనారాయణ, కుటుంబ సభ్యుల సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 222 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,000	5,400
మొదటి రకం	5,500	5,490
రెండో రకం	3,600	4,590
మూడోరకం	3,260	3,490

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
విశ్వం	: సత్యనారాయణ స్క్రీన్-1
లవ్‌రెడ్డి	సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పర్తిసాయి
వేట్టయాన్	: షిర్డీసాయి
వీక్షణం	: వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	: శ్రీసత్య
రివైండ్ (మాట్నీ, సెకండ్ షో)	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్- 4 యూనిట్లు, బి పాజిటివ్-25 యూనిట్లు, ఒ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్(ఫోన్‌నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 411 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని(ఫోన్ నంబర్ 08924-223595)ను సంప్రదించవచ్చు.

బడి..గుడి.. పట్టదు మాకేదీ !

- మద్యం దుకాణాల ఏర్పాటులో నిబంధనలకు తిలోదకాలు
- నివాసాల మధ్యలో షాపులు
- అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కొత్తూరు శారదానగర్‌లో మద్యం దుకాణం వద్దంటూ నిరసన చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)

తుమ్మపాల: మద్యం దుకాణాలకు దక్కించుకున్నవారు నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ఇష్టానుసారంగా షాపులు ఏర్పాటు చేస్తున్నారు. చట్టంలో ఉండే లొసుగులను ఆసరాగా చేసుకుని బడి, గుడి అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దేవాలయాలు, కళాశాలల దగ్గర్లో ఏర్పాటు చేయడం వల్ల అటు భక్తులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. అనకాపల్లి మండలంలో ఐదు షాపులు, పట్టణంలో 14 షాపులను మంజూరు చేశారు. వీటిలో సగానికిపైగా షాపులను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరు శారదానగర్‌లో పోలీస్ స్టేషన్ సమీపంలో జనావాసాల మధ్య ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని గ్రామస్తులు ఆందోళన చేశారు. జిల్లా కేంద్రంగా ఉన్న పట్టణంలో నాలుగు రోడ్ల కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడే ఉన్న జీవీఎంసీ కార్యాలయం, ఆర్టీవో కార్యాలయాలకు అధికారులతో పాటు నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఇక్కడ వినాయక మందిరం ఎదురుగా మద్యం దుకాణం ఏర్పాటుచేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

నిబంధనలు గాలికి..

ప్రధాన జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పంచాయతీల్లో ఎన్‌హెచ్‌కు 220 మీటర్లు, పట్టణ ప్రాంతాలను ఆనుకుని ఉన్న జాతీయ రహదారికి అరకిలోమీటర్లు దూరంలో మాత్రమే షాపులు నిర్వహించాలి. బడి,గుడికి 100 మీటర్ల దూరంలో మాత్రమే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలి. అయితే దేవదాయశాఖ పరిధిలోకే ఉండే ఆలయాలకు, ఆర్గనైజ్డ్ పాఠశాలలకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుందని చెబుతుండడం కొసమెరుపు. దీనిని ఆసరాగా చేసుకుని ఇష్టానుసారం దుఖాణాలు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో అనకాపల్లి - ఆనందపురం జాతీయ రహదారిలో కోడూరు వద్ద జాతీయ రహదారికి దగ్గరలో మద్యం దుకాణం ఏర్పాటుచేశారు.

కూటమి నాయకుల పైరవీలు

గత ప్రభుత్వ హయాంలో మద్యం దుకాణాల ఏర్పాటులో రాజకీయ జోక్యం లేకుండా ఉండేది. కూటమి ప్రభుత్వంలో మద్యం పాలసీ మార్చి దుకాణాల ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తులకు అనుమతులివ్వడంతో పైరవీలు ఎక్కువయ్యాయి. చిన నాలుగు రోడ్ల కూడలిలో గత 40 ఏళ్లుగా కొనసాగుతున్న మద్యం దుకాణం పాయింట్‌లో ఈ సారి మద్యం దుకాణం వద్దంటూ బంగారం వర్తకులు ఫిర్యాదులు చేయడంతో నిలిపివేశారు. అయితే మళ్లీ కూటమి నాయకులతో బేరాలు కుదరడంతో అక్కడే మద్యం దుకాణం ఏర్పాటుచేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బంగారు వర్తకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నివాసాల మధ్య షాపులను తొలగించాలి

నివాసాలకు సమీపంలోని మద్యం దుకాణాలను తొలగించాలి. బడి, గుడి అనే తేడా లేకుండా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. దీని వల్ల మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. వీటిపై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి. బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయకుండా చూడాలి

–ఈ.బ్రహ్మాజీ, మార్టూరు గ్రామం

నిబంధనలకు అనుగుణంగానే దుకాణాలు

జాతీయ రహదారి, దేవాలయాలు, జనావాసాల సమీపంలో షాపులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. ఫిర్యాదు వచ్చిన చోట పరిశీలించి దుకాణాల యజమానులతో మాట్లాడి సమస్యకు పరిష్కార మార్గాలు చూపిస్తున్నాం. సమస్యలు ఉత్పన్నమవుతున్న చోట్ల 15 రోజుల గడువులో మార్పులకు అవకాశం ఇస్తున్నాం. నిబంధనలకు అనుగుణంగా అనుమతిస్తున్నాం.

–సీఐ లక్ష్మణనాయుడు, అనకాపల్లి ఎక్సైజ్ డివిజన్

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



చింతలపాలెం గ్రామ సభలో అర్జీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కశింకోట: భూముల వివాదాలు, సమస్యల పరిష్కారానికే గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చింతలపాలెం, గొబ్బూరు గ్రామాల్లో శనివారం నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. గతంలో నిర్వహించిన రీసర్వేలో లోపాలను సవరించడానికి, ఇతర భూ వివాదాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. చింతలపాలెంలో 22, గొబ్బూరులో 16 అర్జీలు వచ్చాయి. ఈకార్యక్రమంలో రీసర్వే ఉప తహసీల్దార్ జి.భాస్కరరావు, ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగు గ్రామాల్లో పల్లె పండగ

కశింకోట: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఆదివారం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. చిన్నయ్యపాలెంలో ఉదయం 9 గంటలకు, చెరకాంలో 10 గంటలకు, తీడలో 11 గంటలకు, ఈ.చౌడువాడలో 11.45 గంటలకు ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు చెప్పారు.

చిరు వ్యాపారిపై కానిస్టేబుల్ జులుం

పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

పెందుర్తి: అనకాపల్లి జిల్లాలో పని చేస్తున్న ఓ కానిస్టేబుల్ పెందుర్తి ప్రాంతంలోని ఓ చిరు వ్యాపారిపై జులుం ప్రదర్శించడంతో బాధితుడు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కృష్ణరాయపురం కూడలి వద్ద మహేష్ అనే వ్యక్తి టిఫిన్ దుకాణం నడుపుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి స్థానికంగా నివాసం ఉంటున్న గణేష్ అనే వ్యక్తి మహేష్ దుకాణం వద్దకు టిఫిన్ కోసం వచ్చాడు. ఈ క్రమంలో మహేష్‌తో గణేష్ గొడవపడ్డాడు. స్థానికులు కలగజేసుకుని అప్పటికీ గొడవ సద్దుమణిగేలా చేశారు. అయితే గణేష్‌కు పరిచయం ఉన్న అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఆనంద్ ప్రసాద్‌కు విషయం చెప్పాడు. దీంతో కానిస్టేబుల్ ఆనంద్ ప్రసాద్ శనివారం ఉదయం మహేష్ దుకాణం వద్దకు వచ్చి «నేను పెందుర్తి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్‌ని..మా స్నేహితుడితోనే గొడవ పడతావా..నీ సంగతి తేలుస్తా» అంటూ మహేష్‌ను కొట్టాడు. దీంతో బాధితుడు మహేష్ పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ సతీష్‌కుమార్ ఈ కేసుపై విచారణ చేస్తున్నారు.

వజ్రకవచధర గోవింద



ధాన్య వేంకటేశ్వరస్వామి

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరరావు ఆలయంలో శనివారం స్వామిని వజ్రకవచం, పూలమాలలు, తులసీ మాలలతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామపారాయణ చేశారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపొద్దు




నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, ప్రజలు

రాంబిల్లి (యలమంచిలి) ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపవద్దని సీపీఎం రాంబిల్లి మండల కన్వీనర్ జి.దేముడునాయుడు కోరారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రాంబిల్లిలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సర్దుబాటు పేరుతో రూ.8,114 కోట్ల చార్జీలను పెంచేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విద్యుత్ భారాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచినప్పుడు బాదుడే బాదుడు అన్న తెలుగుదేశం నాయకులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరింత విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపాలని చూస్తున్నారని చెప్పారు. పేదలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని నమ్మించి, నేడు విద్యుత్ చార్జీలు పెంచడానికి సిద్ధమవుతోందంటే ఇంతకంటే మోసం మరొకటి ఉండదన్నారు.విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రామకృష్ణ, డి.కాశియ్య, వై.రాము, కె.లక్ష్మి, బి.శ్రీనివాస్, చోడిపిల్లి గంగరాజు,నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారిపై అన్నపూర్ణ దాబా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం శనివారం లభ్యమైంది. అందిన సమాచారం మేరకు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

22 నుంచి అందుబాటులోకి సీటీ స్కాన్ సేవలు



వైద్యాలయంలో సీటీస్కాన్ మిషన్

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో సీటీ స్కానింగ్ మిషన్ సేవలను మంగళవారం నుంచి రోగులకు అందుబాటులోనికి తీసుకువస్తున్నట్టు వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు శనివారం చెప్పారు.మూడు రోజుల పాటు మిషన్‌పై ట్రైల్‌రన్ చేశామని, ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లు, అత్యవసరమైన సమయంలో ఉన్న రోగులకు మాత్రమే ఆది, సోమవారాల్లో సిటీస్కానింగ్ మిషన్‌పై ట్రైల్ రన్ చేస్తున్నామని ఆయన చెప్పారు. సిటీస్కానింగ్ పోస్టులను భర్తీచేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు తెలిపారు.

20 నుంచి సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్ బృందంతో సమావేశమైన ఎంపీడీవో

కోటవురట్ల:ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ బృందం క్షేత్ర స్థాయి పరిశీలన ఈ నెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరగుతుందని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సోషల్ ఆడిట్ బృందం, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఏపీవో నాగరాజు మాట్లాడుతూ 1,467 పనులకు ఉపాధి వేతనదారులకు రూ.17.80 కోట్లు చెల్లించామని, మెటీరియల్ రూపంలో రూ.4.60 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, గ్రామసభల ద్వారా విచారణ చేస్తారని తెలిపారు.

కోటవురట్లలో కుండపోత



కోటవురట్లలో కురుస్తున్న వర్షం

కోటవురట్ల: మండలంలో శనివారం కుండపోతగా వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి వర్షం నీరు చేరింది. ఈ వర్షం వరి చేలకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు. తెగుళ్ల ఆశించకుండా వర్షం దోహదపడుతుందని చెబుతున్నారు. వర్షంతో పాటు పడిన పిడుగుల శబ్దాలు స్థానికులను భయభ్రాంతుకు గురిచేశాయి.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

కోటవురట్ల: విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ సూచించారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌ను వారు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలించి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా బోధన ఉండాలన్నారు. హెచ్‌ఎం నాని మణిమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలి



ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అనకాపల్లి: ఆరోగ్యం పాడుచేసే మద్యం ధరలను అందుబాటులోకి తేవడం కాదని, నిత్యావసర సరకుల ధరలను తగ్గించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకొవాలని జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయలో ఆర్డీవో షేక్ ఆయిషాకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం ధరలను అదుపులోకి తేవడమే ఘనకార్యంగా భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, అడ్డు అదుపులేకుండా పెరిగిపోతున్న నిత్యావసర సరకుల ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేశారు. బియ్యం, గోధుమలు, పప్పుదినుసులు, వంటనూనె, కాయకూర ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, ఆడారి బుచ్చిరాము, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ ధరను పునరుద్ధరించాలి

తుమ్మపాల: విశాఖ డెయిరీ యాజమాన్యం పాల ఉత్పత్తిదారుల నుంచి సేకరిస్తున్న పాలకు ధరలను తగ్గించడం వల్ల పాడి రైతులు నష్టపోతున్నారని, వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి కె.లోకనాథం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం లాభసాటిగా లేకపోవడం వల్ల ఉత్తరాంధ్ర జిల్లాలోని సుమారు 3లక్షల మంది రైతులు పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అధిక శాతం రైతులు విశాఖ డెయిరీకి పాలుపోస్తున్నారి పేర్కొన్నారు. వారికి డెయిరీ చెల్లిస్తున్న ధర గిట్టుబాటుగా లేదని, కనీసం ఆవుపాలకు లీటరకు రూ.50, గేద పాలకు లీటరకు రూ.100 కూడా ఇవ్వడం లేదని తెలిపారు. విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాలకు లీటరుకు రూ.3 తగ్గించడం వల్ల పాడి రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పశుపోషణ వ్యయం విపరీతంగా పెరిగినప్పటికీ విశాఖ డెయిరీ యాజమాన్యం పాలసేకరణ ధరలను తగ్గించడం దుర్మార్గమని తెలిపారు. పాలసేకరణ ధరలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పాడిరైతులను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కశింకోటలో 'స్వచ్ఛతా హీ సేవ'



రోడ్లు, కాలువల శుభ్రం చేస్తున్న దృశ్యం

కశింకోట:కశింకోట పంచాయతీ పరిధిలోని కంచిపాటి వీధి, గాడి వీధి ప్రాంతాల్లో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తా చెదారం తొలగించి రోడ్లను, మురికి కాలువలను శుభ్రపరిచారు. సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఈవోపీఆర్ ఎం.వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, సచివాలయం, పంచాయతీ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే 'పల్లె పండగ'



అచ్చెర్లలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: గ్రామాల అభివృద్ధికి పల్లె పండగ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. మండలంలోని అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో మంగళవారం పర్యటించి సిమెంట్ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగలో సిమెంట్, తారు రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు.

• వావ్..రెయిన్ బో




రంగురంగుల రెయిన్ బో కనువిందు చేసింది. అనకాపల్లి మండలం బట్టపూడి పంచాయతీ సమీపంలో శనివారం కనిపించిన ఇంద్రధనస్సును స్థానికులు ఆసక్తిగా తిలకించారు. - అనకాపల్లి

ఆక్రమణల చెరలో ఆవ

నష్టపోతున్న రైతులు
కన్నెత్తి చూడని అధికారులు



గోపాలపట్నం వద్ద ఉన్న ఆవ



ముంపునకు గురైన పంట పొలాలు (ఫైల్)

పాయకరావుపేట: మండలంలోని గోపాలపట్నం ఆవ ఆక్రమణలకు గురవుతోంది. నక్కపల్లి మండలంలోని ఉద్దండపురం నుంచి గోపాలపట్నం వరకు 720 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆవ విస్తరించి ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటితో పాటు తాండవ నది నుంచి సాగునీటి కాలువల ద్వారా వచ్చే నీరు, వర్షంనీరు ఆవలో నిల్వ ఉంటుంది. అవసరం మేరకు ఇక్కడ నుంచి సుమారు 2,500 ఎకరాల దిగువ ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తారు. సుమారు నాలుగు వందల మంది రైతులు ఈ ఆవపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. అధికంగా వర్షాలు కురిసే సమయంలో ఆక్రమణల కారణంగా వరద నీరు వెళ్లే మార్గం లేక ఆవను ఆనుకుని ఉన్న లోతట్టు ప్రాంతంలో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆక్రమణలను తొలగిస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు ఎక్కువ రోజులు అధికంగా నీరు నిల్వ ఉంటుందని, తమ పొలాలు ముంపునకు గురికావని రైతులు తెలిపారు. ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలనిఅన్నదాతలు కోరుతున్నారు.

80 ఎకరాలు అన్యాక్రాంతం ?

ఆవలో సుమారు 80 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్టు సమాచారం. దీంతో ఆవ గర్భం కుచించుకుపోయింది. కబ్జాచేసిన ప్రాంతాన్ని పొలాలుగా మార్చి యథేచ్ఛగా సాగు చేస్తున్నారు. అక్రమార్కులు ఇష్టానుసారం ఆక్రమిస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.